సాక్షి ప్రకాశం
శనివారం ၊ 28 ၊ డిసెంబర్ ၊ 2024



కూటమి నేతల కుతంత్రం

వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుబాట నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు శుక్రవారం దర్శిలో కూటమి నేతలు కుట్రలకు పాల్పడ్డారు.

- 8లో..



పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించాలి

పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
29/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు సిటీ: ప్రత్యేకమైన ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన మేధావి, ప్రగతి కాముకుడు మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి భారతావనికి తీరని లోటని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. శుక్రవారం మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా ఉదయం ఆంధ్రకేసరి యూనివర్సిటీ సమావేశపు హాలులో సంతాప సభను ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు, ప్రిన్సిపాల్ రాజమోహనరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.నిర్మలామణి, సీడీసీ డీన్ ప్రొఫెసర్ సోమశేఖర తదితరులు మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నైపుణ్య శిక్షణలతో ఉపాధి కల్పించాలి

- జాబ్‌మేళాలు నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకునేలా చూడాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: నైపుణ్య శిక్షణలతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రకాశం భవనంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ స్కిల్ హబ్స్, స్కిల్ కాలేజి, ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్ల ద్వారా శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు స్థానిక పరిశ్రమల్లో కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా జపనీస్ భాషపై శిక్షణ ఇచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలకు అధిక సంఖ్యలో నిరుద్యోగులు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్కిల్ కేంద్రాల్లో డిమాండ్ మేరకు అనుగుణంగా ఉండే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. దీనిలో డీఐసీ జీఎం శ్రీనివాసరావు, మెప్మా పీడీ రవికుమార్, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, ఏపీఐఐసీ జెడ్‌ఎం మదన్‌మోహన్, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, లేబర్ డిపార్టుమెంట్ అధికారి గాయత్రీదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పెరిగిన ఉద్యోగుల సమస్యలు



జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యలు మరింత పెరిగాయని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలోని నండూరి ప్రసాదరావు భవనంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు అవుతున్నా ఉద్యోగుల సమస్యల్లో ఒక్కటి కూడా పరిష్కరించలేదని చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం ఉన్న ఉద్యోగం సాయంత్రానికల్లా ఊడిపోతుందని, కోర్టు తీర్పుల నెపంతో వందల మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయమని మండిపడ్డారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇదేనా ఇచ్చే బహుమతి అని ప్రశ్నించారు. ఉన్నపళంగా ఉద్యోగాలను తొలగించడంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయని, తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు తగిన న్యాయం చేయకపోతే ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.సురేష్ మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలుగా, స్టాఫ్ నర్సులుగా శిక్షణ పొందిన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.శ్రీధర్ బాబు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దర్శి నిరసన ర్యాలీలో పాల్గొన్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ



యర్రగొండపాలెంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



గిద్దలూరులో నిరసన తెలుపుతున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కేపీ నాగార్జునరెడ్డి

దారులన్నీ.. పోరుబాట

కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుపై ప్రజాగ్రహం పెల్లుబికింది. సర్దుబాటు పేరుతో ఎడాపెడా కరెంట్ చార్జీలు పెంచి మోయలేని భారం మోపిందని ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ శుక్రవారం నిర్వహించిన పోరుబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. దారులన్నీ నియోజకవర్గాల కేంద్రాలకు చేరుకున్నాయి. ఊరూరు నుంచి వేలాదిగా జనం స్వచ్ఛందంగా తరలి వచ్చారు. పార్టీ శ్రేణులతో కలిసి పోరుబాటకు సంఘీభావం ప్రకటించారు. భారీ ర్యాలీల్లో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక విస్మరించి చంద్రబాబు మరోమారు తన నైజాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు.

- విద్యుత్ చార్జీల పెంపుపై పెల్లుబికిన ప్రజాగ్రహం
- మిన్నంటిన నిరసనలు
- ర్యాలీలు, ధర్నాలతో అట్టుడికిన నియోజకవర్గ కేంద్రాలు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో నిరసనలు
- భారీ ఎత్తున పాల్గొన్న ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు

సాక్షి ప్రతినిధి ఒంగోలు: ఎన్నికల సమయంలో ''విద్యుత్ చార్జీలు పెంచం..తగ్గిస్తాం'' అంటూ హామీలు ఇచ్చిన చంద్రబాబు అండ్‌కో అధికారంలో వచ్చాక చార్జీలు పెంచి నయవంచనకు పాల్పడ్డారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన పోరుబాట కార్యక్రమం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో విజయవంతమైంది. కరెంటు చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ శ్రేణులతో ప్రజలు కలసి రావడంతో దారులన్నీ పోరుబాట వైపే అన్నట్టుగా సాగింది. రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా ఆరు నెలల్లో ప్రజలపై పెనుభారాన్ని చంద్రబాబు మోపారని జనం మండి పడ్డారు.



కొండపిలో నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



సంతనూతలపాడులో నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

■ గిద్దలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోరుబాట కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. వేలాదిగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలతో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీ బస్టాండ్ సమీపంలో విద్యుత్ శాఖ కార్యాలయం వరకూ సాగింది. ఏఈ నరాల రమణారెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రూ.15 వేల కోట్లు పెంచి ప్రజలపై భారీస్థాయిలో భారం మోపారని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు.

■ దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నేతృత్వంలో దర్శి పట్టణంలో జరిగిన పోరుబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ ఈఈ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అన్ని మండలాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు వైఎస్సార్ సీపీ జెండాలు, ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఈఈ కార్యాలయంలో తమ విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

■ విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా యర్రగొండపాలెం ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమరభేరిని మోగించారు. యర్రగొండపాలెం పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి అక్కడ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అన్ని మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో పట్టణం జనసంద్రంగా మారింది. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి అన్ని మండలాల నుంచి జెడ్పీటీసీలు, ఎంపీపీ, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

■ ఒంగోలు నగరంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు నేతృత్వంలో నిర్వహించిన పోరుబాట కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. నగరంలోని చర్చి సెంటర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి భారీ ర్యాలీ జరిగింది. తొలుత నాయకులు వైఎస్సార్, డాక్టరు బీఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ''బాదుడే బాదుడు, ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం, దొంగల రాజ్యం'' అంటూ కూటమి సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ర్యాలీలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకరబాబు, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

■ కొండపి నియోజకవర్గంలో పోరుబాట కార్యక్రమం విజయవంతమైంది. అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వందలాదిగా పాల్గొని కూటమి ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొండపిలో తహశీల్దార్ కార్యాలయం సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లి సబ్ ఇంజినీర్‌కు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, అన్ని మండలాల నుంచి జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

■ మాజీ మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మేరుగు నాగార్జున ఆధ్వర్యాన నిర్వహించిన పోరుబాటలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంతనూతలపాడులోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ మీదుగా విద్యుత్ సబ్ స్టేషన్ వరకు వెళ్లి విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చీమకుర్తి మునిసిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, అన్ని మండలాల నాయకులు హాజరయ్యారు.

■ మార్కాపురం మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా తర్లుపాడు రోడ్డులోని వాటర్‌ట్యాంక్ వద్ద నుంచి విద్యుత్ ఈఈ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఈఈ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, ఏపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

■ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధర్వంలో నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా కనిగిరిలోని పామూరు బస్టాండ్ నుంచి విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ చార్జీలు పెంపునకు నిరసనగా చేసిన నినాదాలతో పట్టణం మార్మోగింది. కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డితో పాటు అన్ని మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం చార్జీలు తగ్గించాలంటూ ఎలక్ట్రికల్ ఏఈకి వినతి పత్రం అందజేశారు.



కనిగిరి ర్యాలీలో పాల్గొన్న దద్దాల నారాయణ యాదవ్ తదితరులు



మార్కాపురం నిరసన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి

నిరసనల హోరుతో పోరుబాట

- బాదుడే బాదుడు అంటూ నినాదాలు చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్
- ఒంగోలులో నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు ఆధ్వర్యంలో నిరసన

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఒంగోలులో నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట నిరసన కార్యక్రమం విజయవంతమైంది. చుండూరు రవిబాబుతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జూపూడి ప్రభాకరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకరబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల బ్రహ్మానందరెడ్డి, లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ ఒంగోలు చర్చి సెంటర్ లోని వైఎస్సార్ విగ్రహానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు బాదుడే బాదుడు అంటూ నినాదాలు చేశారు. అన్నవరప్పాడు మూడో లైన్ వద్ద విద్యుత్ భవన్ వరకు ర్యాలీగా వెళ్లి విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో నిర్వహించిన నిరసన విజయవంతమైంది.



ఒంగోలులో నిరసన ర్యాలీలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తదితరులు

ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ట్రూఅప్ చార్జీల పేరిట ప్రజలపై రూ.15,485.36 కోట్ల భారాన్ని మోపారన్నారు. చంద్రబాబు అబద్ధాలు, మోసాలు మళ్లీ ఒకసారి రుజువవుతున్నాయని, వాటిని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కరెంటు చార్జీలు పెంచారని అనేక ఆరోపణలు చేసిన చంద్రబాబు అధికారంలోకి వస్తే పెంచబోనని, తగ్గిస్తానన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఉచితంగా ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు ఇస్తే ప్రస్తుతం వాళ్ల ఇంటికి కూడా ట్రూఅప్ చార్జీల పేరుతో వెయ్యి రూపాయల నుంచి రూ.3 వేల వరకు ఇళ్లకు బిల్లులు పంపుతున్నారని, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ర్యాలీగా వెళ్లి విద్యుత్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశామన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ అబద్ధాల ద్వారా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అబద్ధాలకోరులు ప్రజలను జీవితకాలం మోసం చేయాలనుకుంటే పొరపాటని, ఈ అబద్ధాలను ప్రజలు తెలుసుకున్న తర్వాత ఒక్క నిమిషం కూడా కుర్చీలో కూర్చోలేరన్నారు.

రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకరబాబు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ ఆరు నెలల్లోనే చంద్రబాబు ప్రజలపై భరించలేని భారం వేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే గళం విప్పుతూనే ఉంటామని, రోడ్ల మీదకు వస్తూనే ఉంటామని, కేసులకు, వేధింపులకు భయపడేది లేదన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలపై మోపిన పన్నుల భారం రద్దు చేస్తానన్నారు. రైతు రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారంలో వచ్చి చేయకుండా నిట్టనిలువునా మోసం చేశాడన్నారు. రుణమాఫీ చేసింది వైఎస్సార్ అయితే రుణమాఫీ చేస్తానని చెప్పి కనీసం వడ్డీ కూడా మాఫీ కూడా చేయనివాడు చంద్రబాబు అన్నారు. చంద్రబాబు వచ్చిన ఆరు నెలలకే ఇప్పటికే రూ.6072 కోట్లు వసూలు ప్రారంభించారని, మళ్లీ జనవరిలో రూ.9412 కోట్లు పెంచే నిర్ణయంతో మొత్తం రూ.15,480 వేల కోట్లకు పైగా భారాన్ని ప్రజలపై మోపాలని చూడటం హేయమైన చర్య అన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తూ, పెంచిన చార్జీలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

– లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు పరిపాలన అంటే విద్యుత్ చార్జీలతో దోపిడీ, బాదుడుగా మారిపోయిందన్నారు. చంద్రబాబు పాలనలో ప్రజలపై కరెంట్ చార్జీల భారం మోపి నడ్డి విరుస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు నిట్టనిలువునా మోసం చేశాడని విమర్శించారు.


కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు కుప్పం ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు దామరాజు క్రాంతికుమార్, జెడ్పీటీసీ సైకం లక్ష్మీశారద, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, శ్యాంసాగర్, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, నాగూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చావలి శివ, యరజర్ల రమేష్, పసుమర్తి గోపీచంద్, తాతా శ్రీనివాసులు, ఆళ్ల రవీంద్రరెడ్డి, మిట్నసాల శాంతారావు, పి.కోటేశ్వరరావు, కె.కోటియాదవ్, రొండా అంజిరెడ్డి, బడుగు ఇందిర, బత్తుల ప్రమీల, భూమిరెడ్డి రమణమ్మ, విజయలక్ష్మి, వడ్లమూడి వాణి, ప్రసన్న, మేరీ, రమణమ్మ, ముళ్లంగి రవీంద్రరెడ్డి, పిగిలి శ్రీను, కఠారి సాయి, మీరావలి, పులుసు సురేష్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు సుతారం శ్రీనివాసులు, పి.సుధాకర్, వెంకయ్యనాయుడు, కఠారి ప్రసాద్, ఎం.సూర్యరాజేష్, జాకీర్ హుస్సేన్, ఎంపీటీసీ మన్నే శ్రీనివాసరావు, భాస్కర్, గోనెల శివకుమార్, గద్దల బుజ్జి, పురిణి గోపి, దేవా, కొప్పోలు ప్రభాకర్, వెంకట రామిరెడ్డి, కాళీ యాదవ్, మేడికొండ అంకబాబు, శ్రీనివాసుల రెడ్డి, కమ్మ సురేష్, గద్దల సులోమాన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఆరు నెలల్లోనే చంద్రబాబు రంగు బయటపడింది

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకులు ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: మేము అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచబోమని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట మరచిపోయి విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. శుక్రవారం మల్లయ్య లింగం భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఆరు నెలల్లోనే చంద్రబాబు రంగు బయటపడిందని వ్యాఖ్యానించారు. అడ్డగోలుగా విద్యుత్ బిల్లులు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం దీనికి గత ప్రభుత్వంపై నిందలు మోపడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉంది ఎన్డీఏ కూటమి ప్రభుత్వమా లేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమా అని నిలదీశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో మొత్తం రూ.25 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడం ఎంత వరకు సబబన్నారు. ఎప్పుడో పదేళ్ల క్రితం వాడిన విద్యుత్‌కు ప్రస్తుతం అద్దెకు ఉంటున్న వారు ఎలా భరిస్తారని ప్రశ్నించారు. కాకినాడ పోర్టు కేంద్రంగా పట్టుకున్న బియ్యంపై గగ్గోలు పెడుతున్న పవన్ కళ్యాణ్ అదానీ విషయంలో నోరు విప్పకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రాష్ట్రంలో బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వమే విద్యుత్ భారాలను భరించాలన్నారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించగా జిల్లా నాయకులు ఆర్ .వెంకటరావు, కె.వీరారెడ్డి, నల్లూరి మురళి, కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరాం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల చైనా పర్యటనకు వెళ్లి వచ్చిన గుజ్జుల ఈశ్వరయ్యను ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటు


మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సిటీ:మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధులు జూపూడి ప్రభాకరరావు, బత్తుల బ్రహ్మానంద రెడ్డి, లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, తదితరులు మన్మోహన్‌సింగ్ మృతికి శుక్రవారం పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి


కలెక్టర్‌తో డీఎంహెచ్‌ఓ

ఒంగోలు టౌన్:గర్భిణుల వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మ్యాపింగ్‌తో పాటు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక డీఎంహెచ్‌ఓ చాంబర్లో ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గర్భిణుల వివరాల నమోదును రెండు రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. గర్భిణులకు అందించాల్సిన సేవల వివరాలను ఎంసీపీ కార్డు, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీపీహెచ్ఎన్‌ఓ సుగుణమ్మ, డీపీఎంఓ డాక్టర్ వాణిశ్రీ, ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథి, డాక్టర్ ప్రీతం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి


సంఘటన స్థలంలో సీతమ్మ మృతదేహం

మద్దిపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన జాతీయ రహదారిపై మద్దిపాడు సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మద్దిపాడుకు చెందిన సీతమ్మ (80) మతిస్థిమితం లేకుండా తిరుగుతుంటుంది. గురువారం అర్ధరాత్రి మద్దిపాడు సమీపంలోని జాతర రెస్టారెంట్ వైపు జాతీయ రహదారిపై వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణపవరం సమీపంలో మరో వ్యక్తి దుర్మరణం...

త్రిపురాంతకం: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన జాతీయ రహదారిపై త్రిపురాంతకం మండలంలోని గణపవరం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కురిచేడు మండలం కల్లూరుకు చెందిన ఎస్.పెద్దిరాజు మృతి చెందగా, స్థానిక ఎస్సై శివబసవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


మృతి చెందిన బీరం సుబ్బారెడ్డి

కంభం: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం స్థానిక గురుకుల పాఠశాల సమీపంలో చోటుచేసుకుది. వివరాలు.. మండలంలోని సూరేపల్లికి చెందిన బీరం సుబ్బారెడ్డి(55) కంభం నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో నడింపల్లి గ్రామం నుంచి శ్రీకాంత్ అనే వ్యక్తి కంభం వైపు బైక్‌పై వస్తున్నాడు. రెండు వాహనాలు గురుకుల పాఠశాల సమీపంలో ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన బీరం సుబ్బారెడ్డికి తొలుత కంభంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. శ్రీకాంత్ కంభం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు.

కూటమి నేతల కుతంత్రం

- వైఎస్సార్‌సీపీ నిరసనను అడ్డుకునేందుకు పన్నాగం
- విద్యుత్ చార్జీలకు జగనే కారణం అంటూ రెవెన్యూ కార్యాలయం గేట్లకు ఫ్లెక్సీలు
- ఫ్లెక్సీలను తొలగించిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి
- అడ్డుకునేందుకు ప్రయత్నించిన టీడీపీ నేత పుల్లలచెరువు చిన్నా
- కార్యకర్తలను శాంతిపజేసిన ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం


ఫ్లెక్సీల విషయంలో మండల కన్వీనర్‌తో వివాదం పెట్టుకున్న టీడీపీ నాయకుడు


ఫ్లెక్సీలు పీకారని పోలీసుల సమక్షంలో వాగ్వాదం

దర్శి:

సర్దుబాటు పేరుతో ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాట కార్యక్రమాన్ని దర్శిలో భగ్నం చేసేందుకు కూటమి నేతలు కుట్రలకు తెర తీశారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వైఎస్సార్ సీపీ శ్రేణులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో దర్శి పట్టణంలో జరిగే నిరసన కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారని తెలుసుకున్న కూటమి నాయకులు శుక్రవారం తెల్లవారే సరికి కుట్రలకు తెరతీశారు. ర్యాలీ ప్రారంభమయ్యే గడియారం స్తంభం సెంటర్‌లో రెవెన్యూ కార్యాలయం లోనికి వెళ్లే గేట్లకు, మరి కొన్ని ప్రాంతాల్లో వైఎస్ జగన్ ఫొటోతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జగన్ అవినీతి వల్లే విద్యుత్ భారాలు, విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దే, తాను పెంచిన కరెంటు చార్జీలపై తానే ధర్నా చేస్తున్న తుగ్లక్ జగన్ అంటూ.. అసభ్య పదజాలంతో వాటిని ఏర్పాటు చేశారు. తమ మనోభావాలు దెబ్బతీసేలా ఫ్లెక్సీలు ఉన్నాయంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫ్లెక్సీలు తొలగించిన మండల కన్వీనర్

ఆ ఫ్లెక్సీలను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి తొలగించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న టీడీపీ నాయకుడు పుల్లల చెరువు చిన్నా అడ్డుకున్నారు. ప్రజల విద్యుత్ బిల్లులు తగ్గించాలని కోరుతూ ధర్నా చేసే సమయంలో అసభ్యంగా ఫ్లెక్సీలు వేసి గొడవలు సృష్టించాలని చూస్తే సహించేది లేదని వెంకటరెడ్డి హెచ్చరించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అదే సమయంలో అక్కడకు చేరుకున్న ఎస్సై మురళి, పోలీసు సిబ్బంది వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌తో మాట్లాడుతూ 'ఫ్లెక్సీలు కడితే మాతో చెప్పి తీయించాలి, కానీ మీరే తీసి గొడవలు పెట్టుకుంటే ఎలా' అని ప్రశ్నించారు. పక్కనే ఉన్న ఫ్లెక్సీలు కట్టిన వ్యక్తులు పోలీసులతో కూడా వాదనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వైఎస్సార్ సీపీ శ్రేణుల విజ్ఞప్తితో అన్ని ఫ్లెక్సీలను పోలీసులు తొలగించారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులను ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శాంతింపజేశారు. గడియార స్తంభం వద్ద నుంచే ర్యాలీ నిర్వహించాలని పట్టుబట్టిన వారిని వారించారు. సీఐ రామారావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించడంతో గందరగోళం నెలకొంది. 'మనం ప్రజల కోసం ధర్నాలు చేస్తున్నాం. ప్రజలపై విద్యుత్ భారాన్ని నిరసిస్తూ చేస్తున్న కార్యక్రమాలను కూటమి నాయకులు అడ్డుకోవడాన్ని అందరూ చూస్తున్నారు. వారికి త్వరలో ప్రజలే సరైన బుద్ధి చెబుతారు. ప్రజలను ఇబ్బందులు పెట్టాలని చూసే సంస్కృతి కూటమి నాయకులది అందుకే అలా ఫ్లెక్సీలు వేసి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. మనకు గొడవలు సృష్టించే సంస్కృతి లేదు' అంటూ బూచేపల్లి కార్యకర్తలకు నచ్చజెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

చదరంగ పోటీల్లో ఒంగోలు విద్యార్థిని ప్రతిభ


ప్రశంస పత్రం అందుకుంటున్న ఆముక్త

ఒంగోలు: జాతీయ స్థాయి చదరంగ పోటీల్లో ఒంగోలుకు చెందిన ఆముక్త మరోసారి సత్తాచాటింది. స్థానిక పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఆముక్త.. ఇటీవల అండర్–13 బాలికల విభాగంలో పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంది. నాలుగో స్థానంలో నిలిచి రూ.35 వేల నగదు బహుమతితో పాటు ఈ ఏడాది జరిగే కామన్వెల్త్ చదరంగ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది.

నేడు ప్రభుత్వ పెన్షనర్ల సర్వసభ్య సమావేశం

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ జిల్లా శాఖ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు అంకిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని ఎన్‌జీఓ హోం సమావేశ మందిరంలో ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. సమావేశానికి పెన్షనర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ ప్రభుదాస్‌తో పాటు ఇతర అతిథులు హాజరవుతారని తెలిపారు. 75 సంవత్సరాలు నిండిన జీవిత సభ్యులకు సత్కారం చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పెన్షనర్లు హాజరుకావాలని కోరారు.

పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించాలని, అందుకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనంలో శుక్రవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత పరిశ్రమల సంస్థ జీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల అనుమతుల కోసం వచ్చిన 565 దరఖాస్తుల్లో 499 ఆమోదం పొందినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ నిర్దిష్ట గడువు వరకు వేచిచూడకుండా సత్వరమే నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. పీఎంఈజీపీ పథకం కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే బ్యాంకులకు పంపాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జరుగుతున్న ఎంఎస్ఎంఈ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమలకు సంబంధించి రాయితీలకు 280 క్లెయిమ్స్ వస్తే అందుకు రూ.6.19 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆటోనగర్ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లోని గ్రానైట్ వ్యర్థాల కోసం డంపింగ్ యార్డు కేటాయించాలని పరిశ్రమల ప్రతినిధులు కలెక్టర్ కోరారు. గ్రానైట్ ఎగుమతుల కోసం చెన్నై పోర్టుకు వెళ్లడం వల్ల ఒక్కో కంటైనర్‌కు సుమారు రూ.20 వేలు అదనంగా చెల్లించాల్సి వస్తోందని, కృష్ణపట్నం పోర్టులో గ్రానైట్ ఎగుమతుల కోసం ఒక బెర్త్ కేటాయించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని గ్రానైట్ పరిశ్రమల ప్రతినిధులు కోరారు. సమావేశంలో మెప్మా పీడీ రవికుమార్, డీటీసీ సుశీల, ఏపీసీపీడీసీఎల్ ఏసీ వెంకటేశ్వర్లు, డీఎల్‌డీఓ మహాలక్ష్మి, నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ వినియోగం పెంచేందుకు కృషి చేయాలి

సౌర విద్యుత్ వినియోగం పెంచేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం అమలుపై ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో శుక్రవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 5 వేలకు పైగా జనాభా ఉండి ఎక్కువ సౌర విద్యుత్ వినియోగించే ఒక గ్రామంలో మరింత సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం రూ.కోటి ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన ఐదు ప్రత్యేక గ్రామాల్లో ఆ దిశగా సాధించిన పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ అధికారి వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ రవికుమార్, సోలార్ విద్యుత్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల ఆరోగ్యాన్ని సంరక్షిస్తూ, నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా పాఠాలు బోధించాలని సంక్షేమ శాఖల అధికారులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లాలోని సంక్షేమ శాఖల అధికారులు, హాస్టళ్ల సిబ్బందితో శుక్రవారం గ్రీవెన్స్ హాల్లో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని స్పష్టం చేశారు. విద్య, ఆరోగ్య భద్రతకు సంబంధించి విద్యార్థుల నుంచి ఒక్క ఫిర్యాదు వచ్చినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణ కోసం పంచాయతీలు, మున్సిపాలిటీలు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. ఒక డాక్టర్‌ను హాస్టళ్లకు అనుసంధానం చేయాలన్నారు. హాస్టళ్ల మరమ్మత్తులు చేపట్టడంతోపాటు అవసరమైన చోట కొత్త భవనాలు నిర్మించేందుకు అనుమతి ఇచ్చామన్నారు. హాస్టళ్ల మరమ్మతు పనులను జనవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ అధికారి అంజల, మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, దివ్యాంగుల సంక్షేమ సహాయ అధికారి అర్చన, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ సూరిబాబు, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీపీఓ వెంటనాయుడు, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ జయ, ఇతర మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

అమ్మా, నాన్న.. నేను చనిపోతున్నా..

- ఇంట్లో నుంచి వెళ్లిపోతూ ఫోన్
- పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు
- సాంకేతికత ఆధారంగా గుర్తించి పట్టుకొన్న కొడవలూరు పోలీసులు
- మార్కాపురంలోని తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగింత
- క్రికెట్ బెట్టింగ్‌కు బానిసైనట్లు నిర్ధారణ


ఇంటి నుంచి పారిపోయిన యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న కొడవలూరు సీఐ, ఎస్సైలు

కొడవలూరు: అమ్మా, నాన్న.. నేను చనిపోతున్నా.. అంటూ ఇంటి నుంచి పారిపోతూ ఓ యువకుడు తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. అప్రమత్తమైన తల్లిదండ్రులు 112కు కాల్ చేయడంతో ప్రకాశం జిల్లా పోలీసులు సాంకేతికత ఆధారంగా ఆ యువకుడు ఎక్కడ ఉన్నాడో గుర్తించి సమీపంలోని కొడవలూరు పోలీసులకు సమాచారం అందించారు. లారీలో వెళ్తున్న ఆ యువకుడిని పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు సమాచారం మేరకు.. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన 30 ఏళ్ల యువకుడు శుక్రవారం మధ్యాహ్నం తల్లిదండ్రులకు ఫోన్ చేసి నేను చనిపోతున్నానని చెప్పి కాల్ కట్ చేశాడు. ఆందోళనకు గురైన ఆ యువకుడి తల్లిదండ్రులు 112కు కాల్ చేసి సమాచారం అందించారు. అప్రమత్తమైన ప్రకాశం జిల్లా పోలీసులు సాంకేతికత ఆధారంగా ఆ యవకుడు ఎన్‌హెచ్–16పై నెల్లూరు వైపు వెళ్తున్నట్లు గుర్తించి వెంటనే కొడవలూరు ఎస్సై సీహెచ్ కోటిరెడ్డికి సమాచారం అందించారు. సీఐ ఎ.సురేంద్రబాబు, ఎస్సై, తమ సిబ్బందితో కలిసి ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆ యువకుడు హైవేపై లారీలో వెళ్తున్నట్లు గుర్తించి గండవరం సబ్‌స్టేషన్ సమీపంలో ఫ్లైఓవర్ వంతెన వద్ద లారీని ఆపి లారీలో ఉన్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మార్కాపురంలోని యువకుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

క్రికెట్ బెట్టింగ్‌లే కారణం

అదుపులోకి తీసుకున్న ఆ యువకుడ్ని కొడవలూరు పోలీసులు విచారించారు. బీటెక్ వరకు చదివి క్రికెట్ బెట్టింగ్‌లకు బానిసై అప్పుల ఊబిలో కూరుకుపోయి గత్యంతరం లేక ఇంట్లో నుంచి పారిపోయినట్లు వెల్లడించారు. కుమారుడు సురక్షితంగా తమ చెంత చేరడంతో యువకుడి తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కుమారుడి ప్రాణాలు కాపాడిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల ఫిజికల్ టెస్ట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- వివరాలు వెల్లడించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ప్రిలిమినరీ పరీక్ష పాసైన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్టులను ఈ నెల 30వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఈవెంట్స్‌కు 5,345 మంది అభ్యర్థులు హాజరుకానుండగా, వారిలో 4,435 మంది పురుషులు, 910 మంది మహిళా అభ్యర్థులు ఉన్నట్లు వివరించారు. ఎలాంటి లోపాలు లేకుండా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాలని, 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల లాంగ్ జంప్ ఈవెంట్స్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎస్ఎల్‌పీఆర్‌బీ)ని ఆదేశించారు. అభ్యర్థుల కోసం వైద్య శిబిరం, మంచినీరు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశించి దేహదారుఢ్య పరీక్షలు పూర్తి చేసుకుని బయటకు వెళ్లేంత వరకు పరీక్షలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలియజేస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎంపిక ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు వివరించారు. ప్రతి అభ్యర్థికి బయోమెట్రిక్, కాలికి చిప్‌తో కూడిన రిస్ట్ బ్యాండ్ ఉంటుందని, ఈవెంట్స్ జరిగే ప్రదేశాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈవెంట్లకు హాజరయ్యే అభ్యర్థులు అడ్మిట్ కార్డులో నిర్దేశించిన తేదీల్లో ఉదయం 5 గంటలకు ఒంగోలులోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు వద్దకు రావాలన్నారు. అడ్మిట్ కార్డు, స్టేజ్–1, స్టేజ్–2 అప్లికేషన్ కాపీలు, అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఒకసెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులతోపాటుగా ఎలాంటి ఎలక్ట్రానిక్ డివైజ్ అనుమతించడం జరగదన్నారు. అభ్యర్థిని మాత్రమే మైదానంలోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యే గర్భిణులు పీఈటీ మినహాయింపు కోసం ఎస్ఎల్‌పీఆర్‌బీకి రిక్వెస్ట్ మెయిల్ చేసుకోవాలని తెలిపారు. అలాగే హోంగార్డులు తాజా సర్వీస్ సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు...

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పే దళారులను నమ్మి మోసపోవద్దని ఎస్పీ స్పష్టం చేశారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులడిగితే వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ప్రతిభ ఆధారంగానే ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేశారు. నిరుద్యోగుల ఆశలను సొమ్ము చేసుకునేందుకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తూ అమాయక ప్రజలను మోసం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా ఫిర్యాదులు ఉంటే 9121102266 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు.

గంజాయి విక్రేతలు నలుగురు అరెస్ట్

- 2 కేజీల గంజాయి స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

గిద్దలూరు రూరల్: మండలంలోని మోడంపల్లె గ్రామ సమీపంలో జగనన్న కాలనీ వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. గిద్దలూరు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న పాలూరి మాబుషరీఫ్, పట్టణానికి చెందిన షేక్.మహబూబ్‌బీ, గిద్దలూరు మండలం కె.ఎస్.పల్లె గ్రామానికి చెందిన దాసరి నాని, జయరాంపురం గ్రామానికి చెందిన అవిజ సునిల్ కుమార్ అడ్డదారిలో డబ్బు సంపాదించాలని గంజాయి విక్రయించేందుకు సిద్ధపడ్డారు. అందులో భాగంగా నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామానికి చెందిన ఆగడాల రామచంద్రుడు వద్ద గంజాయి కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లలో నింపి, ఒక్కో ప్యాకెట్‌ను రూ.1000కు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిపై నిఘా ఉంచి నలుగురిని అదుపులోకి తీసుకుని 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ కె.సురేష్, ఎస్సై ఇమ్మానియేల్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత పోలీసుల అనుభవాలతో మెరుగైన సేవలు


విశ్రాంత పోలీసు అధికారులతో ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: సుదీర్ఘ కాలం పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి రిటైర్డ్ అయిన వారి అనుభవాలతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. శుక్రవారం నగరంలోని పోలీసు కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ విశ్రాంత పోలీసు అధికారుల సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ దామోదర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రసంగిస్తూ ఏళ్ల తరబడి శాంతి భద్రతలు, నేర నియంత్రణ, బందోబస్తులతో పాటు ఇతర విధులు నిర్వర్తించిన విశ్రాంత పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శేష జీవితంలో వయోభారం వలన తరచూ ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయని, వాటిని అధిగమించేందుకు మంచి ఆహార నియమాలు పాటిస్తూ తగిన వ్యాయామాలు చేయాలని సూచించారు. విశ్రాంత పోలీసుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఎలాంటి సమస్య వచ్చినా పోలీసు శాఖ అండగా ఉంటుందని తెలిపారు. పోలీసులు విధి నిర్వహణలో ఆరోగ్యాని కంటే ప్రజా భద్రతకే ప్రాధాన్యత ఇస్తుంటారని చెప్పారు. కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వహిస్తారని ప్రశంసించారు. అనంతరం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పోలీసు అధికారులు, వారి కుటుంబ సభ్యులను ఎస్పీ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వారి కుటుంబ సభ్యుల యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కేవీ సుబ్బారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రమేష్ కృష్ణన్, రమణారెడ్డి పాల్గొన్నారు. యూనియన్ ఉపాధ్యక్షుడు షేక్ అల్లాభక్ష్ వందన సమర్పణ చేశారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో విశ్రాంత పోలీసులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

ఆస్తి కోసం ఘాతుకం

- శీతలపానీయంలో సైనైడ్ కలిపి పిన్నమ్మకు తాగించి హత్య
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నం
- కేసు వివరాలు వెల్లడించిన మార్కాపురం డీఎస్పీ నాగరాజు

యర్రగొండపాలెం: ఆస్తి, ప్రమాద బీమా సొమ్ము కోసం ఓ యువకుడు తన పిన్నమ్మకు సైనైడ్ కలిపిన శీతలపానీయం తాపి అంతమొందించాడు. ఆపై బైక్ నుంచి జారిపడి మృతి చెందినట్లు నేరుగా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసుల దర్యాప్తులో అసలు విషయం వెలుగుచూసింది. శుక్రవారం యర్రగొండపాలెం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ యు.నాగరాజు కేసు వివరాలు వెల్లడించారు. గుర్రపుశాలకు చెందిన సింగారపు సంజీవయ్య అనే వ్యక్తి అక్కచెల్లెళ్లు అయిన పెద్ద కోటమ్మ, చిన్న కోటమ్మను వివాహం చేసుకున్నాడు. చిన్న కోటమ్మకు సంతానం లేరు. ఆమె పేరుతో ఉన్న ఆస్తుల విషయంలో కొంత కాలం క్రితం పొరపొచ్చాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో చినకోటమ్మను అంతమొందించాలని అక్క కుమారుడు చెన్నయ్య ఏడాది క్రితమే పథకం రచించాడు. పిన్నమ్మకు టీడీపీ, జనసేన సభ్యత్వాలుండటంతో ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా డబ్బు కూడా వస్తుందన్న దుర్బుద్ధి తోడైంది. ఈ క్రమంలోనే ఆరు నెలల క్రితం మార్కాపురం నుంచి వెండి, బంగారం శుభ్రం చేసే సైనైడ్ తీసుకొచ్చి సమయం కోసం ఎదురు చూశాడు. ఈ నెల 21వ తేదీన గ్యాస్ డబ్బులు డ్రా చేసుకుందామని చెప్పి యర్రగొండపాలెంలోని హెచ్‌పీ గ్యాస్ ఆఫీసు వద్దకు తన తల్లితోపాటు పిన్నమ్మను పిలుచుకొచ్చాడు. కూల్ డ్రింక్‌లో సైనైడ్ కలిపి పిన్నమ్మకు ఇవ్వగా.. 'చేదుగా ఉంది, తనకు వద్ద'ని చెప్పినా వినకుండా బలవంతంగా తాగించాడు. ఆమె మృతి చెందిన తర్వాత బైక్ నుంచి జారి పడి మృతి చెందినట్లు పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశాడు. చిన్న కోటమ్మ మృతదేహాన్ని సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య పరిశీలించి హత్య చేసినట్లు అనుమానించారు. గుర్రపుశాల వీఆర్వో కాసా వెంకటసత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ, ఎస్సైలతోపాటు కానిస్టేబుళ్లు పి.బాషావలి, అనిల్‌కుమార్‌ను అభినందించారు.